సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్

కార్మిక వ్యతిరేక విధానాలు వీడకపోతే ఉధృత పోరాటాలు

సిఐటియు జిల్లా మహాసభల ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నర్సింగరావు

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ముగిసిన సిఐటియు జిల్లా మహాసభలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు వీడకపోతే ఉధృత పోరాటాలు చేయనున్నట్లు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. రెండు రోజుల పాటు అనంతపురం నగరంలో నిర్వహించిన సిఐటియు 11వ అనంతపురం జిల్లా మహాసభలు ఆదివారం ముగిశాయి. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.నాగమణి అధ్యక్షతన నిర్వహించిన రెండోవ రోజు మహాసభలకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఆఫీస్ బేరర్స్ హాజరయ్యారు. మహాసభలకు మద్దతుగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి హాజరయ్యారు. ఎంతో చైతన్యవంతంగా ఉత్సాహంగా సాగిన మహాసభల్లో ఆయా రంగాల కార్మికుల సమస్యలను ప్రాంతాల వారీగా ప్రతినిధులు మహాసభలో ప్రవేశపెట్టి చర్చించారు. కార్మికుల సమస్యలు, హక్కులు, వేధింపులు, తొలగింపులు, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై కార్మిక రంగాల వారీగా తీర్మానాలు ప్రవేశపెట్టగా 15 తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేస్తూ 13 గంటలు పని విధానానికి అసెంబ్లీలో తీర్మానాంచడం, మహిళలు రాత్రిపూట డ్యూటీ చేయమనడాన్ని వ్యతిరేకించారు. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇస్తూ రెగ్యులర్ చేయాలని తీర్మానించారు. అనంతపురం జిల్లాకు కల్పవృక్షంగా ఉన్న ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్ఎను రెన్యువల్ చేసి కొనసాగించాలని వీటి కోసం కార్మికులందరూ పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపి, రెగ్యులర్ చేయాలన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిర్ణయం ఉపసంహరించి తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని మహిళలపై దాడులు అఘాయిత్యాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఆటో కార్మికులపై వేధింపులు పెనాల్టీలు, ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పని చేస్తున్న డ్రైవర్లపై విధించిన పెనాల్టీలు కేంద్ర ప్రభుత్వం చేసిన 21 జిఓను రద్దు చేయాలని తీర్మానించారు. ఈ తీర్మానాలను ఆమోదించి భవిష్యత్ పోరాటాలు చేయనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. అనంతరం 59 మందితో సిఐటియు జిల్లా నూతన కమిటీని, వారిలో 19 మందిని ఆఫీస్ బేరర్స్‌గా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ ఆర్‌వి.నాయుడు, గోపాల్, వెంకటనారాయణ, రామాంజనేయులు, ముర్తుజా, శ్రీనివాసులు, రమాదేవి, శకుంతల, శివ ప్రసాద్, నాగభూషణం, సాకే నాగరాజు, నాగార్జున రెడ్డి, ఏటిఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రయివేటీకరణ విధానాలు వీడాలి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యుత్ ప్రయివేటీకరణ విధానాలు వీడాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. ప్రయివేటీకరణ వల్ల ఇటు ప్రజలకు, కార్మికులకు ప్రభుత్వానికి నష్టం జరుగుతోందని, యాజమాన్యాలు లాభపడతున్నాయని తెలిపారు. విద్యుత్ రంగంలో అతి ప్రమాదకర పనులు చేస్తూ కార్మికులు మృతి చెందుతున్నారని, వారి కుటుంబాలకు ఎలాంటి భద్రత ఆదరణ లేకుండా పోతోందన్నారు. సిమెంట్ పరిశ్రమల్లో కార్మికులంతా కాంట్రాక్ట్ కార్మికులుగా అతి తక్కువ వేతనాలతో పని చేయించడం అన్యాయంగా ఉందన్నారు. ప్రభుత్వం శ్రమ ద్వారా సంపద సృష్టించే కార్మికులను అనగదొక్కాలని చూస్తే కార్మిక వర్గం తిరగబడుతుందని హెచ్చరించారు. కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతున్నామన్నారు. డిసెంబర్ 31, జనవరి 1,2,3,4 తేదీల్లో విశాఖపట్టణంలో నిర్వహిస్తున్న సిఐటియు అఖిలభారత మహాసభల్లో భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ 8 గంటల పని విధానాన్ని 13 గంటలుగా పెంపుదల చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. పేదరికాన్ని నిర్మూలించేందుకు పి4 విధానం అమలు చేస్తున్నామంటూ ముఖ్యమంత్రి చెబుతుండటం మోసపూరితంగా ఉందన్నారు. ఈ దుర్మార్గపు విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు రాబోయే రోజుల్లో పోరాటాలు చేస్తుందన్నారు.

మహాసభలకు హాజరైన ప్రతినిధులు

ట్రంప్ టారీఫ్‌లు దేశానికి నష్టం

ప్రధాని నరేంద్రమోడీ మౌనమెందుకో ?

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

భారత దేశంపై ట్రంప్ విధిస్తున్న టారీఫ్‌లు తీరని నష్టాన్ని చేకూరుస్తాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా ట్రంప్‌ను ప్రధాన మంత్రి మోడీ ప్రశ్నించలేని స్థితిలో ఉండటం శోచనీయమన్నారు. ట్రంప్ టారీఫ్ బెదిరింపు -భారతదేశంపై ప్రభావం అన్న అంశంపై సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు జరిగింది. నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వి.రాంభూపాల్ ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. ట్రంప్ రెండవసారి అధ్యక్షుడిగా ఎన్నికైనప్పటి నుంచి భారతదేశంపై టారీఫ్‌లను విధిస్తూ పోతున్నాడని అన్నారు. ఈ ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక దిగుమతులపై 25 శాతం వరకు టారీఫ్ విధించారన్నారు. తాజాగా ఫార్మా దిగుమతులపై వంద శాతం టారీఫ్ విధించారన్నారు. తద్వారా ఇక్కడి ఫార్మ రంగంపై ఈ ప్రభావం తీవ్రంగా ఉండనుందని అన్నారు. అదే విధంగా గత కొన్ని రోజుల క్రితం హెచ్1 బి వీసాలపైనా పది లక్షల డాలర్ల పన్ను వేయడం జరిగిందన్నారు. ఇలా భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకుని ట్రంఫ్ టారీఫ్‌లపైన టారీఫ్‌లు విధిస్తూపోతున్నారన్నారు. అంతేకాకుండా అమెరికా నుంచి జరిగే దిగుమతులపైనా పన్నులు తగ్గించాలని ఒత్తిడి పెంచుతున్నారన్నారు. రష్యా నుంచి చమురు దిగుమతులపైనా సుంకాలను అమెరికా విధిస్తోందన్నారు. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన 2022 నుంచి తక్కువ ధరకే రష్యా నుంచి భారతదేశానికి చమురు లభిస్తోందన్నారు. అయితే దాని ఫలితం సామాన్య ప్రజలకు దేశంలో లభించలేదన్నారు. పెట్రోల్ ధరలు ఏ మాత్రం తగ్గలేదని చెప్పారు. దాని లాభం మాత్రం అంబానికి చెందిన సంస్థకు రెండున్నరేళ్లలో నాలుగున్నర లక్షల కోట్ల రూపాయల లాభం చేకూరిందన్నారు. ఇంత జరుగుతున్నా ట్రంప్ టారీఫ్‌లపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పెదవి విప్పకపోవడం శోచనీయమన్నారు. భారతదేశం కంటే చిన్నచిన్న దేశాలు ట్రంఫ్ విధానాలను బహిరంగంగా ఎండగడుతున్నారని గుర్తు చేశారు. అంతకు మునుపు వరకు ట్రంప్, మోడీ మంచి స్నేహితులమని చెప్పుకునే వారని ఇప్పుడు దేశానికి ఆయన వలన నష్టం జరుగుతున్నా ప్రశ్నించలేని స్థితిలో ఉన్నారని విమర్శించారు. ట్రంఫ్ టారీఫ్ విధానాలు భారాతదేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుందన్నారు. ప్రధానంగా సామాన్యులు కూడా ఇందులో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటోందన్నారు. ఇప్పటికే ఆక్వా రైతులు తమ ఉత్పత్తులను ఎగుమతి చేసుకోలేక నష్టపోయే పరిస్థితి వచ్చిందన్నారు. ఇక పత్తి, పోగాకు దిగుమతులపై అమెరికా ఒత్తిడి మేరకు పన్ను తగ్గిస్తే ఆ రైతులు కూడా నష్టపోనున్నారని అన్నారు. ట్రంప్ అనుసరిస్తున్న విధానాల మూలంగా దేశానికి జరుగుతున్న నష్టం..అందులో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు వివరించాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, జిల్లా నాయకులు రామాంజినేయులు, నగర నాయకులు ప్రకాశ్, వెంకటనారాయణ, రామాంజినమ్మ, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ దృష్టికి శింగనమల నియోజకవర్గ సమస్యలు

ప్రజాశక్తి-నార్పల

స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలను ఎమ్మెల్యే ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో భాగంగా నార్పల మండల కేంద్రంలో నూతన బస్టాండ్, నార్పల, బుక్కరాయసముద్రం మండల కేంద్రాల్లో 100 పడకల ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే శింగనమల మండల కేంద్రంలోని బస్టాండ్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, గండికోట-పుట్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని పూర్తి చేయాలని కోరారు. ఈ పథకం ద్వారా దాదాపు 35 వేల ఎకరాలకు సాగునీరు, పుట్లూరు, యల్లనూరు మండలాలకు తాగునీరు అందుతుందన్నారు. ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి గ్రామాల ముంపు బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ఆర్థికసాయం అందజేయాలని కోరారు. బుక్కరాయసముద్రం మండలంలోని అనంతసాగర్ కాలనీ, విజయనగర కాలనీల ప్రజలకు అనంతపురం నగరపాలక సంస్థ తరపున తాగునీటి సరఫరా సౌకర్యం కల్పించాలని, బుక్కరాయసముద్రం మండలంలోని పలు కాలనీల్లో నివసిస్తున్న పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఇందుకు స్పందించిన స్పీకర్ ఆయా సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

దీపావళికి ప్రత్యేక రైలు

ప్రజాశక్తి-రాయదుర్గం

దీపావళి పండుగ సందర్భంగా రాయదుర్గం మీదుగా బెంగళూరు నుంచి విజయపురకు ప్రత్యేక రైలు నడపనున్నట్లు నైరుతి రైల్వే అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ బిఎల్ శివకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 17న రాత్రి 10 గంటలకు ట్రైన్ నెంబర్ 06245 సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య బస్ టర్మినల్ (ఎస్ఎంవిటి) బెంగళూరు నుంచి బయలుదేరి తుమకూరు, అరసికేరే, చిత్రదుర్గ, మీదుగా బయలుదేరి మరుసటి రోజు 18వ తేదీ తెల్లవారుజామున 4- 30 గంటలకు రాయదుర్గం చేరుతుందన్నారు. అనంతరం బళ్లారి కంటోన్మెంట్, హొసపేట, గదగ్, బాగల్కోట్ మీదుగా మధ్యాహ్నం రెండు గంటల ఐదు నిమిషాలకు విజయపుర (బీజాపూర్) చేరుతుందన్నారు. ట్రైన్ నెంబర్ 06246 అక్టోబర్ 22న సాయంత్రం ఏడు గంటలకు బయలుదేరి పై తెలిపిన మార్గంలోనే తిరుగు ప్రయాణం చేస్తూ మరుసటి రోజు తెల్లవారుజామున 2:30కి రాయదుర్గం, ఉదయం 11:15కు ఎస్ఎంవిటి బెంగళూరు స్టేషన్ చేరుతుందన్నారు. ప్రయాణికులు ప్రత్యేక రైలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రూ.500కు దసరా పండుగ కిట్లు

ప్రజాశక్తి-నార్పల

పండుగ కిట్లు అందజేస్తున్న డిపిఎం, ఎపిఎం

మహిళా సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వెలుగు మహిళా మార్ట్‌లో దసరా పండుగను పురస్కరించుకుని 11 రకాల వస్తువులతో రూ.500 కిట్‌లు అందజేస్తున్నట్లు డిపిఎం గంగాధర్, ఎపిఎం తిప్పక్క తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోధుమపిండి, కందిబేడలు, సెనగ బేడలు, బెల్ల, ఒక్కో వస్తువు కిలో చొప్పున, ఓలిగరవ్వ, మైదాపిండి, యాలకులు, అప్పడాలు, పామాలిన్, రసంపొడి, ఓలిగ పేపర్ అన్నీ కలిపి కిట్ ఏర్పాటు చేసి రూ.500కు ఇవ్వనున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి పూర్తిస్థాయిలో అన్ని గ్రామ సంఘాలకు కిట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది మహిళా మార్ట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు లబ్ధిదారులు సహకరించాలి

ఐసిడిఎస్ పీడీ ప్రమీల

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

అంగన్వాడీ కేంద్రాలను జిల్లా వ్యాప్తంగా సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని ప్రభుత్వం కేటాయించిన పథకాల్లో భాగంగా అందజేస్తున్న పౌష్టిక ఆహారాన్ని తక్షణమే పొంది అంగన్వాడి కార్యకర్తలకు సహకరించాలని శ్రీ సత్య సాయి జిల్లా పిడి ప్రమీల పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : జిల్లా వ్యాప్తంగా అంగన్వాడి కేంద్రాలు ఎన్ని ఉన్నాయి వాటి నిర్వహణ ఎలా ఉంది ?

జవాబు: శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలు 2824 ఉన్నాయి. వాటి నిర్వహణ పనితీరులో ఎలాంటి లోపాలు లేవు. ఇటీవల ప్రభుత్వం 618మినీ అంగన్వాడి సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చడానికి ఉత్తర్వులు జారీ చేసింది. వాటిలో ప్రస్తుతం 584 మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా మార్చడానికి వీలు ఉంది. దాని ప్రకారం వాటి మార్పు నిర్వహణ సంబంధిత సూపర్వైజర్లకు అప్పగించాం. ఆరు సంవత్సరాల లోపు పిల్లలు ప్రీస్కూల్ నందు శిక్షణ పొందుతున్నారని అదేవిధంగా గర్భవతులు బాలింతలు కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పొందుతున్నారు.

ప్ర : అంగన్వాడీ కేంద్రాలలో లబ్ధిదారులకు ఏయే పౌష్టికాహారం అందజేస్తున్నారు?

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా గర్భవతులకు బాలింతలకు ఒక్కొక్కరికి నెల కు 25 కోడిగుడ్లు ఐదు లీటర్ల పాలు బాల సంజీవని కిట్టు అందజేస్తున్నాం. రు నెలల నుండి మూడు సంవత్సరాల లోపు పిల్లలకు బాలామృతం అందించడంతోపాటు 25 గుడ్లు ,రెండున్నర లీటర్ పాలు, టి హెచ్ ఆర్(టేక్ హోమ్ రేషన్) క్రింద ఇవ్వనున్నాం. ప్రతిరోజు అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే ప్రీస్కూల్ పిల్లలకు మెనూ ప్రకారం భోజనం తోపాటు నూరు మిల్లీ లీటర్లు పాలు ఒక గుడ్డు అందిస్తాం.

ప్ర : జిల్లాలో బాల్యవివాహాలు అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: బాల్యవివాహాలను అరికట్టడానికి మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాం. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కర్నాటక సరిహద్దు ప్రాంతాలైన మడకశిర ,అమరాపురం, ఆగలి ,గుడిబండ ,రొళ్ల రొద్దం నల్లమాడ, అమడగూరు ,కదిరి, రాయదుర్గం, కళ్యాణ దుర్గం తాడిపత్రి, సింగనమల తదితర మండలాల్లో, బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతుంటాయి. అక్కడ పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వడంతో ఎన్నో బాల్య వివాహలను అడ్డుకున్నాం. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడు 112 బాల్య వివాహాలను అడ్డుకున్నాం.

ప్ర : జిల్లాలో నాసిరకం గ్రుడ్లు అంగన్వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తున్నారని ఆరోపణపై మీ సమాధానం?

జ: జిల్లా వ్యాప్తంగా నాసిరకం గుడ్లు పంపిణీ చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై సంబంధిత అధికారులద్వారా తగు చర్యలు చేపట్టాము. నాసిరకం సరుకులను పంపిణీ చేసినప్పుడు ఆయా కేంద్రాల అంగన్వాడి కార్యకర్తలే తిరస్కరించాలని, సమాచారాన్ని వెంటనే సంబంధిత సూపర్వైజర్లకు, సిడిపిఓ లకు సమాచారం ఇవ్వాలని ఆదేశించాం. అలా చేసిన కాంట్రాక్టర్ల తీరులో మార్పు రాకపోతే వారి కాంట్రాక్ట్ ను రద్దు చేయడానికి ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తాం.

5) ఐసిడిఎస్ కార్యాలయాల్లో సిబ్బంది కొరత ఉందా?

జ: ఐసిడిఎస్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. జిల్లా వ్యాప్తంగా వందమంది సూపర్వైజర్లు ఉండాల్సిన చోటు 50 మంది మాత్రమే ఉన్నారు. ఒక్కొక్క సూపర్వైజర్ రెండు, మూడు సెక్టర్లలో పర్యవేక్షణ చేస్తున్నారు. దీంతో కేంద్రాల పర్యవేక్షణ ఆలస్యమవుతోంది. మడకశిర మండలంలో 300 కేంద్రాలను అందువలన సకాలంలో కేంద్రాలను పర్యవేక్షించడానికి వీలు కావడం లేదు.

1వరోడ్డు శ్రీకాశీవిశ్వేశ్వర కోదండ రామాలయాన్ని పునర్ నిర్మిస్తాం

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన అనంతపురంలోని మొదటి రోడ్డులో ఉన్న కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయాన్ని రూ.4.50 కోట్లతో పునర్ నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక ఆలయంలో నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఛైర్మన్‌గా అమిలినేని నరేంద్రచౌదరి తోపాటు కమిటీ సభ్యులుగా దొండ్లగు రాజు, బోయ వెంకటరమణమ్మ, దేవరకొండ రత్నమ్మ, వనితా బాయ్, సోంపల్లి చరణ్ తేజ్, ఆదిశేషయ్య, రాధా, అనంత కుమారి, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా కిషోర్‌కుమార్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, సతీమణి శ్రీలక్ష్మితో కలిసి కాశీవిశ్వేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు మంత్రి లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, బీజేపీ సహకారంతో ఆలయ కమిటీని ఘనంగా ఎంపిక చేసినట్లు చెప్పారు. ఆలయ పునర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబుని అడిగిన వెంటనే రూ.4.50కోట్లు మంజూరు చేశారన్నారు. ఇందులో 20శాతం దాతల సహకారం అవసరం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శిలు తలారి ఆదినారాయణ, బుగ్గయ్యచౌదరి, రాయల్ మురళి, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్ మురళీధర్, నాయకులు సుధాకర్‌యాదవ్, సరిపూటి రమణ, ఫిరోజ్‌అహ్మద్, చల్లా లక్ష్మీప్రసాద్, పిఎల్ఎన్ మూర్తి, పరమేశ్వర్, బొమ్మినేని శివ, బిజెపి రాష్ట్ర నాయకులు లలిత్‌కుమార్, జనసేన నాయకులు జయరామ్‌రెడ్డి, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, టిఎన్‌టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మోహన్‌కుమార్, కార్పొరేటర్ జనబలం బాబా, మాజీ కార్పొరేటర్లు రాజారావు, సరళ, టిడిపి నాయకులు సింగవరం రవి, రాయల్ మధు, దాడి శ్రీనివాస్ చౌదరి, నెట్టెం బాలకృష్ణ, నారాయణస్వామి యాదవ్, మణిరవి వాల్మీకి, దాడి మల్లికార్జున మహిళా నాయకురాలు వడ్డే భవాని, చరిత కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్షింతలు వేసినా స్పందించరా..

ఆర్‌డి హెచ్చరించినా మారని కమిషనర్ వైఖరి

నాడు అవార్డులు..నేడు అథమస్థితి..

గుంతకల్లులో ఎక్కడి సమస్యలు అక్కడే..

అధ్వాన్నంగా పారిశుధ్యం

ప్రతి కౌన్సిల్‌మీట్‌లో సభ్యుల ఆగ్రహం

మదీనా మసీదు, తిలక్‌నగర్ సమీపంలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

ప్రజాశక్తి-గుంతకల్లు

స్వయానా మున్సిపల్ ఆర్‌డి నాగరాజు వచ్చి అక్షింతలు వేసినా గుంతకల్లు కమిషనర్ వైఖరి మాత్రం మారలేదు. పట్టణంలో అనేక సమస్యలు తాండవిస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. ముఖ్యంగా పారిశుధ్యం అధ్వాన్నంగా మరింది. ఏ వీధిలో చూసినా మురుగు, చెత్తాచెదారంతో నిండిపోయిన కాలువలు దర్శనమిస్తున్నాయి. దీనికితోడు దోమలు పెరిగిపోయి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో చెత్తకుప్పలు పేరుకుపోయి కాలనీలు కంపుకొడుతున్నాయని, చిన్నపాటి వర్షాలకు మురుగు కాలువలు నిండి ఇళ్లల్లోకి నీరు వస్తోందని, కుక్కల బెడదను నివారించాలని, ఆవులు రోడ్లపై లేకుండా గోశాలకు తరలించాలని మెజారిటీ సభ్యులు గొంతు చించుకుని అరుస్తున్నా కమిషనర్ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు గుంతకల్లు మున్సిపాలిటీ అవార్డు అందుకుని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచింది. ఇప్పుడు మాత్రం అథమ స్థానానికి వెళ్లిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పురపాలికలకు ప్రకటించిన ర్యాంకుల్లో గుంతకల్లు మున్సిపాలిటీ స్వచ్ఛతలో సగం మార్కులు కూడా సాధించలేకపోవడమే ఇందుకు నిదర్శనం. మున్సిపాలిటీల్లోని ప్రధాన అంశాలైన తాగునీరు సరఫరా, చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, రోడ్లు, వీధిదీపాలు, వరదనీరు నిర్వహణ, ఆదాయం, తదితర అంశాలను ప్రామాణికంగా తీసుకుని ర్యాంకులు ప్రకటించింది. జిల్లాలో తాడిపత్రి మున్సిపాలిటీ అగ్రస్థానంలో నిలవగా, స్వచ్ఛతలో గుంతకల్లు సగం మార్కులు కూడా సాధించలేకపోయింది. 2010-11లో అప్పటి కమిషనర్ చల్లా ఓబులేసు విధులు నిర్వహించిన సమయంలో అధికారులు, పారిశుధ్య కార్మికులను సమన్వయం చేసి శానిటేషన్ నిర్వహణలో రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచి అవార్డుతోపాటు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అయితే ప్రస్తుత కమిషనర్, ప్రజాప్రతినిధుల అలసత్వం కారణంగా పాలన గాడితప్పడంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కూటమి ప్రభుత్వం చెబుతున్నా అధికారులు మాత్రం నిర్లక్ష్యం వీడటంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలో 37 వార్డులో చిన్నపాటి వర్షాలకే సగం వార్డుల్లో మురుగునీరు రోడ్లపైకి చేరుతోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటి చెత్త సేకరణ మరుగున పడి, మురుగు కాలువల్లో మురుగునీరు కాలనీలు అన్నీ దుర్గంధం వెదజల్లుతున్నాయి. చెత్త సేకరణ, డ్రెయినేజీలు శుభ్రం చేయడం, ఫాగింగ్ చేయడంలో శానిటేషన్ సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు తమ వార్డుల్లో పారిశుధ్యం, మురికి కాలువలు నిర్వహణ తదితర సమస్యలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదని మెజారిటీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో పారిశుధ్యం లోపించి అనేక వార్డుల్లో ప్రజలు వ్యాధుల బారినపడి ఆసుపత్రుల పాలవుతున్నారని వామపక్ష రాజకీయ నేతలు, ప్రజా సంఘాల నాయకులు వినతులు, నిరసనలు చేసినా కమిషనర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక శివారు కాలనీల పరిస్థితి మరీ దారుణంగా ఉందని ఆయా వార్డుల కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సింగిల్ యూస్ ప్లాస్టిక్ నియంత్రణపై అధికారులు తూతూమంత్రంగా దాడులు చేయడం మినహా సాధించిందేమి లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన రోజు మాత్రం మహిళా సంఘాల సహకారంలో ర్యాలీలు చేసి చేతులు దులుపుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించి వాటి నిషేధానికి కృషి చేయాల్సిన అధికారులు.. అటువైపు అడుగులు వేయడం లేదనే తెలుస్తోంది. అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నీరు గారుతోందని.. ఇప్పటికైనా అధికారులు ఘన వ్యర్థాల నిర్వహణ, పరిపాలనపై దృష్టి సారించి గుంతకల్లును ఆదర్శ మున్సిపాలిటీగా నిలపాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాశక్తి www.prajasakti.com

మాల మహానాడు జిల్లా కమిటీ ఎన్నిక

మాల మహానాడు నూతన జిల్లా కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని సంగమేష్ సర్కిల్లో ఉన్న ఎస్ఎవిఆర్ ఫంక్షన్హాల్లో ఆదివారం మాల మహానాడు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి అక్కడి నుంచి ఉరుములు కళాకారులతో భారీ ర్యాలీగా ఫంక్షన్హాల్కు చేరుకున్నారు. అనంతరం మాలమహానాడు సంఘానికి రెండు దశాబ్దాలుగా సేవలు అందించిన దళితరత్న ఓబులేసు సంఘం పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సత్కరించారు. తర్వాత నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా దళితరత్న ఓబులేసు, గౌరవ సలహాదారులుగా శ్రీనివాస, జిల్లా అధ్యక్షులుగా సుగుమంచి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ఇంద్ర రమేష్బాబు, ప్రధాన కార్యదర్శిగా చియ్యేడు రాము, కార్యదర్శిగా నీలూరి సురేష్బాబు, కోశాధికారిగా జి.సోమశేఖర్, రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షులుగా కర్ణాటి విజయ్కుమార్, మహిళా కమిటీ జిల్లా అధ్యక్షురాలుగా సాకే శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా ఉరుముల సుమలత, ఉపాధ్యక్షురాలుగా మన్నెల అనిత, నగర అధ్యక్షులుగా సత్యనారాయణ, నగర ప్రధాన కార్యదర్శిగా బి.సురేంద్ర, కోశాధికారిగా అనిల్కుమార్ను ఎన్నుకున్నారు.

భగత్సింగ్కు నివాళి

గుత్తిలో భగత్సింగ్కు నివాళులర్పిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

విప్లవవీరుడు భగత్సింగ్ 118వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం గుత్తిలో జెవివి, భగత్ సింగ్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా నాయకులు పి.వెంకటరామిరెడ్డి, శ్రీధర్గౌడ్, భగత్సింగ్ కమిటీ నాయకులు జగన్, నిజాముద్దీన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు భగత్సింగ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలన్నారు. యువత భగత్ సింగ్ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జెవివి మండల ప్రధాన కార్యదర్శి రంగనాథ్, నాయకులు దేశాయి నాగరాజు, భగత్సింగ్ కమిటీ నాయకులు జి.రమేష్, రంగస్వామి, నాగేంద్ర, కరీం, శివశంకర్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : స్వాతంత్య్ర పోరాట సమరయోధులు సర్దార్ భగత్సింగ్ జయంతిని పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి నవీన్, మండల కార్యదర్శి జయ నరసింహ, కిషోర్, ప్రకాష్, రామాంజి, హుస్సేన్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని విజన్ హైస్కూల్లో యాడికి లియోక్లబ్, యువత సమక్షంలో భగత్సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విజన్ విద్యాసంస్థల అధినేత విశ్వనాథ్, లియో క్లబ్ సభ్యులు విశ్వం, అమర్, శేఖర్, కార్తీక్, శ్రీనివాస్ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ

కళ్యాణదుర్గంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ప్రతులను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కూటమి ప్రభుత్వ బాధితుల కోసం వైసిపి ఆధ్వర్యంలో తీసుకొచ్చిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ను ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలు, నాయకులు, అభిమానులపై కూటమి అరాచకాలను తన బుద్ధి చెప్పేందుకే 'డిజిటల్ బుక్'ను తీసుకొచ్చారన్నారు. నియోజకవర్గంలో ఎక్కడైనా పార్టీ శ్రేణులపై కూటమి నేతలు దాడులు చేస్తే 'డిజిటల్ బుక్-క్యూఆర్ కోడ్'లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లు, కన్వీనర్లు, ఎంపిపిలు, జెడ్పిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మాజీ శాసనసభ్యులు కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జాయింట్ సెక్రటరీ వెన్నపూస వెంకటరామిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ వెంకటరామనేయులు, మహిళా జిల్లా అధ్యక్షులు టి.లక్ష్మీదేవి, మండల జాయింట్ సెక్రటరీ రామాంజనేయులు, తలారి శివయ్య, రామకృష్ణారెడ్డి, కొండారెడ్డి, కమలపాడు రంగ, వెంకటేశ్వర్లు, నాగార్జున, రామకృష్ణ, సాంబశివుడు, లక్ష్మీరెడ్డి, భాస్కర్రెడ్డి, ప్రసాదరెడ్డి, నారాయణరెడ్డి, వేలూరు జగదీశ్వర్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో 1993-1994లో పదో తరగతి చదివిన విద్యార్థులు 32ఏళ్ల తర్వాత ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పూర్వ ఉపాధ్యాయులు మనోహరదేవి, నాదెండ్ల, జాఫర్వలి, పెద్దయ్య, ఆదినారాయణమ్మ, బంగారయ్య, వివి ఆదినారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని రామస్వామి ఆలయం నుంచి బాణాసంచా ఊరేగింపుతో తీసుకొచ్చారు. తర్వాత సరస్వతీదేవి విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ నేడు సమాజంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పిల్లలను బీటెక్, ఎంటెక్ అంటూ డబ్బులు సంపాదించే సాఫ్ట్వేర్ వైపే కాకుండా సామాజిక సేవ వైపుకు కూడా మళ్లించాలన్నారు. కాగా శింగనమలలో ఉద్యోగం చేయడానికి ప్రతి ఉద్యోగీ సంతోషిస్తారన్నారు. ఎందుకంటే గ్రామానికి ఒకవైపు చెరువు.. మరోవైపు పచ్చని పైర్లు.. ఇంకోవైపు మునీశ్వరుడు దేవస్థానం చేసిన కొండలతో ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేట శివాలయ నిర్మాణానికి సహకరించండి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పెద్దవడుగూరులోని పురాతన పేటశివాలయ నూతన నిర్మాణానికి ప్రజలందరూ సహకరించాలని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం పెద్దవడుగూరులో పర్యటించిన ఆయన శివాలయాన్ని పరిశీలించారు. దేవదాయశాఖ ఆలయ నిర్మాణం కోసం రూ.1.25లక్షలు మంజూరు చేసిందని అందుకు ఎమ్మెల్యే అస్మిత్రెడ్డి చొరవ చూపడం హర్షణీయమన్నారు. గ్రామస్థులు కూడా ఇందులో భాగస్వాములై నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు. అలాగే ఎస్సీకాలనీలో ఉన్న సుంకులమ్మ, బస్టాండ్ వద్ద ఉన్న చౌడేశ్వరి ఆలయానికి శ్రీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి వస్త్రాలు అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తాడిపత్రి టిడిపి యువనాయకుడు ఎస్సీ రవీంద్రారెడ్డి, కాంట్రాక్టర్ హరినాథరెడ్డి, నాయకులు కేశవరెడ్డి, బాలిరెడ్డి, గంగరాజు, హరినాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, బాషా, బాలరాజు, చిరంజీవులు, నాగరాజు, నగేష్, ముత్యాలు,గుత్తి అనంతపురం ఎంపీటీసీ చిన్నగోవిందు, కాశేపల్లి సుంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

బ్రహ్మసముద్రం : మండలం పరిధిలోని సంతే కొండాపురం గ్రామపంచాయతీలో ఉన్న కోనాపురం, కొండాపురం, సూగేపల్లి రైతులకు ఆదివారం యూరియా పంపిణీ చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ తెలిపారు. సోమవారం కూడా యూరియా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మల్లెల వనిత, సింగిల్విండో ప్రెసిడెంట్ ఓబులేసు, ఎంపిఇఒ వెంకటరమణ, నాయకులు నల్లమల్ల శ్రీరాములు, తిప్పేస్వామి, నరసింహులు, పాపంపల్లి తిప్పేస్వామి, నాగరాజు, ధనాంజి, నాగరాజు, ప్రకాష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడటం అభినందనీయం

అనంతపురం : పర్యావరణ పరిరక్షణకు సాయిట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్ చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్యాదవ్ కొనియాడారు. ఆదివారం నగరంలోని సూరజ్ గ్రాండ్ హోటల్లో సాయిట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్కు మదర్ ఇండియా బుక్ ఆఫ్ కాల్ రికార్డ్స్ ధ్రువీకరణ ప్రశంసాపత్రం అందించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సాయికుమార్ దాదాపు 21ఏళ్లుగా ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను అందించినందుకు ప్రశంసాపత్రం అందజేశారు.

పొట్లూరి హరికృష్ణకు గుర్రం జాషువా పురస్కారం

పురస్కారం అందుకున్న హరికృష్ణ

అనంతపురం : భాషా సాహిత్య, కళా రంగాల్లో విశేష కృషి చేస్తూ, తొలి జానపద అకాడమీ ఛైర్మన్ గా పని చేసిన కళారత్న పొట్లూరి హరికృష్ణకు గుర్రం జాషువా అవార్డు లభించింది. ఈమేరకు జాషువా జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో హరికృష్ణ పురస్కారాన్ని అందుకున్నారు.

టమోటా రైతు డీలా

పడిపోయిన ధరలు
రవాణా..కూలీల ఖర్చులు రాని వైనం
పొలాల్లోనే పంటను వదిలేస్తున్న రైతులు

ధర లేకపోవడంతో రైతు వదిలేసిన తోట

ప్రజాశక్తి-ఆత్మకూరు

టమోటా ధరలు పూర్తిగా తగ్గిపోవడంతో మండలంలో టమోటా పంట సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. రాత్రింబవళ్లు శ్రమించి, పెట్టుబడులు పెట్టి పండించిన పంటకు కనీస ధర కరువైంది. దీంతో రైతన్నలు విలవిల్లాడిపోతున్నారు. లాభాలను పక్కనపెడితే కనీసం కూలీలు, రవాణా ఛార్జీలైనా వచ్చే పరిస్థితి లేకపోవడంతో పండిన టమోటాలను పొలాల్లోనే వదిలేస్తున్నారు. మండలంలోని సనప, రంగంపేట, తోపుదుర్తి, ముట్టాల, గొరిదిండ్ల, పి.సిద్ధాపురం, తదితర గ్రామాల్లోని మెట్ట ప్రాంతాల్లో వందలాది మంది రైతులు టమోటా పంటను సాగు చేపట్టారు. ఏటా పంట చేతికి వస్తుందన్న సమయంలో ధర పూర్తిగా తగ్గిపోవడంతో రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. కిలో టమోటాలను కనీసం రూ.10కైనా అమ్ముడుపోని పరిస్థితి. ఈనేపథ్యంలో కూలీ, రవాణా ఛార్జీలు గిట్టుబాటు కాక రైతులు దిగాలు చెందుతున్నారు. టమోటా సాగుకు వేలకువేలు పెట్టినా పెట్టుబడులు తిరిగిరాని పరిస్థితుల్లో తీవ్రంగా నష్టపోతున్నారు.

పొలంలోనే పంటను వదిలేశారు..

ఈ ఏడాది దాదాపు వెయ్యి ఎకరాలకుపైగా విస్తీర్ణంలో టమోటా సాగు చేశారు. పంట ఏమో బాగా పండింది. గత రెండు నెలల క్రితం టమోటా పంట భాగానే ధర పలికింది. దీంతో చాలామంది రైతులకు అత్యధికంగా టమోటా సాగు చేశారు. ప్రస్తుతం ధర లేకపోవడంతో కూలీల ఖర్చు కూడా రాకపోవడంతో పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు. టమోటా పంట సాగు చేసి ఏటేటా నష్టపోతున్న తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఉద్యోగులకిచ్చిన హామీలను అమలు చేయాలి

ఆల్మేవా సంఘం నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న ఆల్మేవా నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్మేవా) సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురంలోని లిటిల్ఫ్లవర్ పాఠశాలలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ వై.ఫక్రుద్దీన్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించి తీర్మానించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు షేక్షావలి మాట్లాడుతూ గత 16 నెలలుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు పెన్షనర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా పెండింగ్లో ఉన్న బకాయిలు చెల్లించాలని, 12వ పిఆర్సి అమలు చేయాలని, మధ్యంతర భృతి 30 శాతం, పెండింగ్ డిఎలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇకపోతే జిల్లాకేంద్రంలో మైనార్టీ స్టడీసర్కిల్ ఏర్పాటు చేయాలని, ఉర్దూ భాషాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ప్రధానమంత్రి 15 సూత్రాల పథకం అమలు చేయాలని, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్నిపోస్టులను భర్తీ చేయాలని, మెడికల్ రీయింబర్స్మెంట్ బిల్లులు మంజూరు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, సిపిఎస్, జిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆల్మేవా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ వై ఫక్రుద్దీన్, సంఘం ప్రధాన కార్యదర్శి ఫారుక్ మహమ్మద్, జిల్లా అధ్యక్షులు షేక్షావలి, కార్యదర్శి ఫరూఖ్, నాయకులు ఫక్రుద్దీన్, అన్వర్, రసూల్ అష్రఫ్అలీ, దౌలా, రఫీ, మహబూబ్బాషా, సర్దార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఇంట్లో సోలార్ పవర్ ఉండాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పీఎం సూర్య ఘర్ పథకం కింద అందిస్తున్న సబ్సిడీని వినియోగంచుకుని ప్రతి ఇంటిపై సోలార్ పవర్ను ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. ఆదివారం అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో పీఎం సూర్య ఘర్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంట్లో సోలార్ పవర్ ఉండాలన్నదే ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. ఈ పథకం కింద ఇంటిపై సోలార్ యూనిట్లు ఏర్పాట్లకు పెద్దఎత్తున సబ్సిడీ కూడా ఇస్తున్నట్లు వివరించారు. వెయ్యి నుంచి 3వేల కిలోవాట్ల సామర్థ్యం ఉన్న వాటిని ఏర్పాటు చేసుకునే వీలుంటుందన్నారు. వినియోగదారులు ఇంటిపై ఏర్పాటు చేసుకుంటే దాదాపు 15ఏళ్ల వరకు ఉచితంగా విద్యుత్ పొందవచ్చన్నారు. ఈ పథకంపై ఆర్పిలు మహిళా సంఘాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అనంతరం మహిళా సంఘాలను నడిపించడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఆర్పిలకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దంపతులు దసరా కానుకగా చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు భవాని, కాటమయ్య, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, ఎపిఐఐసి డైరెక్టర్ చల్లా లక్ష్మీప్రసాద్, నాయకులు కడియాల కొండన్న, సుధాకర్యాదవ్, అహ్మద్, సంగా తేజస్విని, బాలాంజనేయులు, రాజారావు, చేపల హరి, గోపాల్ గౌడ్, నెట్టెం బాలకృష్ణ, భక్తవత్సలం నాయుడు, బోయపాటి బాలప్ప, కదిరప్ప, ఈడిగ నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ఇనుప ఖనిజం దోపిడీపై సిబిఐతో విచారించాలి

రాయదుర్గం : రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓబులాపురం మైనింగ్ కంపెనీ క్వారీలో జరిగిన ఇనుప ఖనిజం దోపిడీపై సిబిఐతో విచారణ చేయించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంబ్లీలో రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఓబులాపురం మైనింగ్ ఇనుప ఖనిజం దోపిడీపై విచారణ చేయాలని కోరితే అందుకు మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి స్పందించడం సమంజసం అన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో విచారణ చేయిస్తే అధికార పార్టీకి అనుకూలంగా నివేదిక వచ్చే అవకాశం ఉన్నందున నిష్పక్షపాతంగా వాస్తవాలు వెలుగులోకి వచ్చేందుకు సిబిఐకి అప్పగించాలని కోరారు.

ఆధునిక యుగకర్త జాషువా

మంత్రి సత్యకుమార్యాదవ్

జాషువాకు నివాళులర్పిస్తున్న మంత్రి సత్యకుమార్, తదితరులు

ప్రజాశక్తి-అనంతపురం

తన రచనల ద్వారా సమాజాన్ని ప్రభావితం చేసిన ఆధునిక యుగకర్త మహాకవి గుర్రం జాషువా అని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమం, వైద్య విద్యాశాఖ మంత్రి సత్యకుమార్యాదవ్ అన్నారు. గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని ఆదివారం మహాకవి గుర్రం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రధాన గేటుకి ఎదురుగా ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గబ్బిలం, పిరదౌసి,, ముంతాజ్మహల్, క్రీస్తు చరిత్ర, శివాజీ, గిజిగాడు వంటి ఖండ కావ్యాల ద్వారా సమాజాన్ని అభ్యుదయం వైపు నడిపించిన గొప్ప సాహితీవేత్త గుర్రం జాషువా అని కొనియాడారు. సమాజంలో ఉన్న పీడన, అణచివేత, కులవివక్షపై తిరుగుబాటు చేసి సమ సమాజం నిర్మాణం, మహిళల అభ్యున్నతి, మహిళా సమానత్వం కోసం ఎనిలేని రచనలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేయర్ వసీంఅహ్మద్, జాషువా సాహిత్య పీఠం కార్యనిర్వాహకులు హెచ్.నాగలింగయ్య, డాక్టర్ నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, కొగటం విజయ భాస్కర్రెడ్డి, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ కె.సుధాకర్బాబు, ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎన్.రంగస్వామి, బిజెపి నాయకులు లలిత్కుమార్, లలిత కళా పరిషత్ మాజీ అధ్యక్షులు గాజుల వెంకటసుబ్బయ్య, గంగిరెడ్డిగారి అశ్వర్థరెడ్డి, ఎస్సీ ఎస్టీ జెఎసి రాష్ట్ర నాయకులు సాకే హరి, టీవీ రెడ్డి, జూటూరు షరీఫ్, షేక్ రియాజుద్దీన్ అహ్మద్, తోట నాగరాజు, డి.కృష్ణమూర్తి, మిద్దె మురళీకృష్ణ, చెట్ల ప్రవీణ్, హరీష్శంకర్, కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని కళ్యాణదుర్గం పెన్షనర్స్ భవన్లో ఆదివారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అగ్రహారం సత్యనారాయణ రచించిన అక్షర విన్యాసములు పుస్తకాన్ని చల్లా కిషోర్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, విమర్శకులు రాజారావ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘం గౌరవాధ్యక్షులు చల్లా రాజశేఖర్, జి.మారెప్ప, విశ్రాంత ఉపాధ్యాయులు తిమ్మాపురం ఎస్.గంగప్ప, విశ్రాంత డిటిఒ గురువేపల్లి నరసింహులు, అష్టావధాని ఎం.తిప్పేస్వామి, సుధీర్, బద్దే నాయక్, తిప్పేస్వామి, ఎంఇఒ కుందుర్పి, రోజ్లీ రాజేష్, ఆది ఆంధ్ర తిప్పేస్వామి, కవి గాయకుడు వెటర్నరీ మల్లి, మెడికల్ సోము, తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యంగా స్థలాన్ని ఆక్రమించుకున్నారు..

న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు


పత్రాలను చూపుతున్న బాధితురాలు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని అశోక్ నగర్లో ఉన్న తమ ఇంటి స్థలాన్ని తమ బంధువులు ఆక్రమించుకున్నారని బాధితులు సిఎస్. రజియా, సిఎస్ దాదా ఖలందర్ వాపోయారు. ఈమేరకు ఆదివారం వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అశోక్నగర్లోని సర్వే నెంబర్ 2134లో ప్లాట్ నెంబర్ 22, ఇంటి నెంబర్ 12-1-350లో తమ తాత సిఎస్. ఫక్రుద్దీన్, అవ్వ సిఎస్. మస్తాన్బీకు 5.64 సెంట్ల స్థలం ఉందన్నారు. వీరికి నలుగురు కుమారులు కాగా గతంలో ముగ్గురు కలిసి తాము ఊరిలో లేని సమయంలో తమ అవ్వకు విషయం చెప్పకుండా స్థలాన్ని వారి పేరుమీద రిజిస్టర్ చేయించుకున్నారని వాపోయారు. విషయం తెలిసిన తర్వాత 2021లో తాము కోర్టును ఆశ్రయించగా కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. అయితే తమ చిన్నాన్నలు మోసం చేసి 2022 డిసెంబర్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న స్థలంలో 1.88 సెంట్లను రాయచూరు బాబా ఫక్రుద్దీన్ అనే వ్యక్తికి విక్రయించారన్నారు. దీంతో ఆయన నిర్మాణాలను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. కోర్టు తుదితీర్పు ఇచ్చేంత వరకూ ఎవరూ సంబంధిత స్థలానికి సంబంధించి క్రయ విక్రయాలుగానీ, నిర్మాణాలు గానీ చేయకూడదని కోర్టు తెలిపిందన్నారు. కోర్టు ఉత్తరఉవలను దిక్కరించి నిర్మాణాలు చేపట్టాలని చూస్తున్నారన్నారు. తాము పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. సమస్యపై ఇప్పటికే కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. దయచేసి తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకున్నారు.

నేడు అవగాహన ర్యాలీ

అనంతపురం : ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఈనెల 29న సోమవారం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, కార్డియాలజిస్ట్ సుభాష్ చంద్రబోస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 9 గంటలకు అనంతపురం ప్రభుత్వ వైద్యకళాశాల నుంచి ప్రదర్శనగా 10.30 గంటలకు సూపర్ స్పెషాల్టీ వైద్యశాలకు చేరుకోనున్నట్లు తెలిపారు. అక్కడ నిర్వహించనున్న ప్రత్యేక సమావేశానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ ఆనంద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కియా సిఇఒ కబ్లడంగ్లో, తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

సంగీత సత్సంగం

అనంతపురం : నగరంలోని 2వరోడ్డులో ఉన్న మహతి లలిత సంగీత 'పాట'శాలలో ఆదివారం సంగీత సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్స్టార్ కృష్ణ నటించిన చిత్రాల్లోని పాటలు గాయకులు పాడి అలరించారు. అనంతరం ఆత్మీయ అతిథిగా ప్రొఫెసర్ కె.సుధాకర్బాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో 'పాట'శాల అధినేత మహీధర్, ఎంపీ శ్రీనివాసులు, టీచర్ శ్రీనివాసులు, లంకా ప్రసాద్, నాగరాజు, ఈశ్వరయ్య, మాధవి, రమారెడ్డి, సావిత్రి, ఆశ, రాధ, ఆంజనేయులు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చైతన్య సదస్సును జయప్రదం చేద్దాం

గుత్తి : వచ్చేనెల 13వ తేదీన అనంతపురంలో జరిగే మాదిగల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని ఎంఆర్పిఎస్ జిల్లా నాయకుడు ఎన్.వీరన్న పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఆర్అండ్బి అతిథి గృహంలో ఎంఆర్పిఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైతన్య సదస్సుకు ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక నాయకులు మందకృష్ణ మాదిగ హాజరవుతారన్నారు. కావున సదస్సుకు నాయకులు, కార్యకర్తలు, మాదిగలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ నాయకులు ఎన్.వీరాంజనేయులు, ఎన్.రాజు, ఎస్.మద్దిలేటి, అయ్యప్ప, నగేష్, హెచ్సి.రంగడు, నగదాని సత్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

యల్లనూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ రాము ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ హాజరు కావాలన్నారు. కావున ప్రజలు వచ్చి తమ సమస్యలపై అర్జీలు సమర్పించి పరిష్కరించుకోవాలని కోరారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న ఇన్ఫినిటీ ట్రస్టు సభ్యులు

కళ్యాణదుర్గం రూరల్ : క్యాన్సర్ వ్యాధితో ఓ విద్యార్థినికి ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ ఆదివారం ఆర్థికసాయం చేశారు. కళ్యాణదుర్గంలోని గరీబ్నగర్లో నివసిస్తున్న ప్రయివేటు బస్సు డ్రైవర్ ప్రవీన్కుమార్ కూతురు అనూజ్ఞ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న బద్దేనాయక్ చందాలు వేసుకుని పోగైన రూ.50వేల సొమ్మును ఆసుపత్రికి చేరకుని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కోశాధికారి అబ్దుల్వాహబ్, సభ్యులు సాయినాథ్, ఉపాధ్యాయులు లక్ష్మన్న, రామాంజినేయులు, వెంకటేష్, మహేష్, గరీబ్నగర్ కాలనీవాసులు చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల సంతల ఆదాయం రూ.3,62,850

అనంతపురం : స్థానిక మార్కెట్ యార్డులో ఆదివారం నిర్వహించిన పశువులు, మేకల సంతల ద్వారా రూ.3,62,850 ఆదాయం వచ్చినట్లు ఇన్ఛార్జి మార్కెట్ యార్డు కార్యదర్శి రాఘవేంద్రకుమార్, సూపర్వైజర్ కిషోర్కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధ్యాయులైన మాజీ సైనికులకు సన్మానం

ఉపాధ్యాయుల పోస్టులకు ఎంపికైన మాజీ సైనికులను సన్మానిస్తున్న మాజీ సైనిక సంఘం నాయకులు

అనంతపురం : ఉపాధ్యాయ పోస్టులు సాధించిన మాజీ సైనికులను ఆదివారం నగరంలోని మాజీ సైనికుల కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీలో మాజీ సైనికులు పిబి రామాంజనేయులు, ఎం.విశ్వేశ్వర్రెడ్డి, డి.విజయశేఖర్రెడ్డి ఉపాధ్యాయ పోస్టులు సాధించారు. దీంతో మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుడు సార్జంట్ సంజీవ్కుమార్, ట్రెజరర్ తిమ్మారెడ్డి, సిద్దన్న, నరసింహులు, బి.రవికుమార్, బిఎ హుస్సేన్, ఈశ్వరయ్య, కరణం కృష్ణ, నాగిరెడ్డి, రంగారెడ్డి, ప్రతాపరెడ్డి, నాగరాజ్, ఖాజామొద్దీన్, వై.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాట స్థావరాలపై దాడులు

15 మంది జూదరుల అరెస్టు..రూ.40వేలు స్వాధీనం

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న రూరల్ సీఐ శివగంగాధర్రెడ్డి

తాడిపత్రి రూరల్ : పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి 15 మందిని అదుపులోకి తీసుకోవడంతోపాటు రూ.40వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సిఐ శివగంగాధర్రెడ్డి, ఎస్ఐ ధరణి బాబు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. పక్కాగా అందిన సమాచారంతో ఎస్పీ జగదీష్ ఆదేశాలు ఎఎస్పీ రోహిత్ కుమార్చౌదరి పర్యవేక్షణలో మండల పరిధిలోని పెన్నానది ఒడ్డున కొత్త బ్రిడ్జి కింద, చుక్కలూరు గ్రామం వద్ద గ్రానైట్ ఫ్యాక్టరీలో వేర్వేరుగా దాడు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న 15 మందిని అరెస్టు చేసి రూ.40వేల నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గుత్తి : మండలంలోని జక్కలచెరువు గ్రామంలో ఆదివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. సిఐ రామారావు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ సమీపంలోని సూర్యప్రకాష్రెడ్డి తోటలో పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని రు.39,350 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసామన్నారు. పేకాట జూదరులపై కేసు నమోదు చేశామని సిఐ వెల్లడించారు.

విద్యుత్ ప్రమాదంలో ఉద్యోగికి గాయాలు

చికిత్స పొందుతున్న రామాంజనేయులు

బొమ్మనహాల్ : మండల కేంద్రంలోని సచివాలయం పరిధిలో విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న కురుపు రామాంజనేయులు ఆదివారం విద్యుత్ ప్రమాదంలో గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. రామాంజనేయులు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో నేమకల్ ఫీడర్ ఎల్సి తీసుకుని ఓ రైతు పొలంలో సర్వీసు పని చేస్తుండగా బొమ్మనహాల్ ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా కావడంతో ప్రమాదం జరిగినట్లు విద్యుత్ ఎఇ లక్ష్మారెడ్డి తెలిపారు. వెంటనే రైతులు, విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తమై బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు వివరించారు.